క్లుప్తంగా

నేత్ర వైద్యశిబిరం రేపు

పాలకొండ రూరల్: ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతృత్వంలో బుధవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకుడు బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న శిబిరంలో డాక్టర్ బొడ్డేపల్లి అనూష పర్యవేక్షణలో సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు పనుకువలసలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పాలకొండ రూరల్: మండలంలోని పనుకువలస ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కోట మంజుభార్గవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే వైద్యబృందాలు, వలంటీర్లు ఇంటింట సర్వే చేపట్టి ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించారని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభంకానున్న శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంత - నర్సిపురంలో..

వీరఘట్టం: మండలంలోని సంత-నర్సిపురంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

63 వినతుల స్వీకరణ

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి 63 వినతులు స్వీకరించారు. చిన్నగుమ్మడకు చెందిన సవర భీమారావు ఆటో కొనుగోలుకు రుణం మంజూరు చేయాలని.. కుట్టుమిషన్ మంజూరు చేయాలని కిరపకు చెందిన శ్రావణి.. గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని జాడుపల్లికి చెందిన గాయత్రి, తదితరులు వినతులు సమర్పించారు. అలాగే మరికొంతమంది వ్యక్తిగత, సామాజిక సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

రహదారి సదుపాయం కల్పించండి

పార్వతీపురం: సీతంపేట మండలం మర్రిపాడు గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, రామకృష్ణ, తదితరులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను పార్వతీపురంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మర్రిపాడు, నడిమిబంద, ఎగువ దొరబంద, దిగువ దొరబంద గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని వినతిలో పేర్కొన్నారు.

అధికారుల దృష్టికి విద్యుత్ స్తంభాల సమస్య

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామంలో నెలకొన్న విద్యుత్ స్తంభాల సమస్యను సర్పంచ్ కనుముల సంధ్యారాణి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.క్రిష్ణమూర్తి దృష్టికి సోమవారం తీసుకెళ్లారు. దీంతో సమస్యను పరిష్కరించాలని ఎస్ఈ కృష్ణమూర్తి పాలకొండ ఏడీ మోహన్ చక్రవర్తిని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అధికారులు గ్రామంలో సోమవారం పర్యటించి, విద్యుత్ స్తంభాల పరిస్థితిని సమీక్షించారు. త్వరలోనే కొత్త విద్యుత్‌స్తంభాలు వేస్తామని చెప్పారు.

శతాధిక వృద్ధుడి మృతి



సురగాల సూరయ్య(ఫైల్)

సీతానగరం: మండలంలోని పెదభోగిలి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు సురగాల సూరయ్య (107 సంవత్సరాలు) సోమవారం స్వగృహంలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలియజేశారు. నూట ఏడు సంవత్సరాలు ఒకరిపై ఆధారపడకుండా జీవించడం, సూరయ్య రాష్ట్ర రహదారిపై పూర్వం సువర్ణముఖినదిపై నిర్మించిన బ్రిడ్జి పనుల్లో పాల్గొన్న సందర్భాన్ని, సంఘటనలను తెలియజేశారు. గ్రామంలో ఏవైనా మంచి, చెడు కార్యక్రమాలు చేపట్టినా పెద్దవాడైన ఆయన సూచనలు, సలహాలు అందించేవారని చెప్పారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

పార్వతీపురంటౌన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో పలు చోట్ల వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతా నియమావళిని పాటించకపోవడం వల్లనే వాహన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాటిని అరికట్టేందుకు జిల్లా రవాణాశాఖాధికారి సి.మల్లికార్జున రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పార్వతీపురం పట్టణంలో నిర్వహించిన డ్రైవ్‌లో 45 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.2.10 లక్షలు అపరాధ రుసుము వసూలు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని కోరారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మోటార్ వెహికల్ ట్రిపుల్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, ఆటోవాలాలు ఓవర్‌లోడ్ ప్రయాణం చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు రమేష్ కుమార్, కాశీరామ్ నాయక్, వర ప్రసాద్, సత్యనారాయణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భామిని: పెద్దదిమిలిలో ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అప్పారావు



గుమ్మలక్ష్మీపురం: దుమ్మంగిలో వైద్యశిబిరం వద్ద రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



కురుపాం: వలసబల్లేరులో నేత్రవైద్య తనిఖీలు చేస్తున్న సిబ్బంది



సీతంపేట: కిండంగిలో రోగులకు వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు వచ్చిన రోగులకు వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని, 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు కోరారు. -సాక్షి నెట్‌వర్క్.



గుమ్మలక్ష్మీపురం: దుమ్మంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్



కురుపాం: వలసబల్లేరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ



వీరఘట్టం: నీలానగరం లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగన్నాథరావు

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి



విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్

కొమరాడ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్ సూచించారు. సోమవారం మండలంలోని విక్రంపురం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రతీ తరగతికి వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

మెనూ పాటించాలి

గరుగుబిల్లి: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో ఎస్.భూషణరావు సూచించారు. మండలంలోని నవిరి ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన పాఠశాల పరిసరాలు, రికార్డులు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలించారు. రుచి, శుచితో కూడిన భోజనం విద్యార్థులకు పెట్టాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయండి అని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సోమవారం సమావేశమైన ఆమె ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తొమ్మిది రకాల పథకాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. గ్రామాల్లో కార్యదర్శులు పథకాలకు సంబంధించిన సమాచారం సేకరించి, ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు, వైద్యాధికారి ఎస్.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ఈకేవైసీకి గడువు పూర్తి



వీఏఏలకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

జియ్యమ్మవలస: ఈకేవైసీ నమోదుకు మంగళవారంతో గడువు పూర్తవుతుందని, రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ సూచించారు. సోమవారం మండలంలోని అల్లువాడ గ్రామ సచివాలయంలో వీఏఏలతో సమావేశమైన ఆయన ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు ప్రక్రియలపై ఆరాతీశారు. ప్రతీ రైతు తమ పంటలకు సంబంధించి, ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి హర్షలత తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు

గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ ఎన్.మధుసూదనరావు సోమవారం తెలిపారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ సంస్థ సంచాలకుల ఆదేశాల మేరకు ఆయా రోజుల్లో పుస్తక పఠనం, వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు వంటివి నిర్వహిస్తామని, ఆదివారం యథావిధిగా చదవడం మాకిష్టం కార్యక్రమం ఉంటుందన్నారు. దసరా సెలవుల్లో విద్యార్థుల ఆలోచన చెడు అలవాట్లు, తిరుగుళ్ల వైపు మళ్లకుండా చదువుపైనే ఆసక్తి ఉండేలా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

వైద్యశిబిరానికి స్పందన



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

పాలకొండ రూరల్: స్థానిక సత్యసాయి సేవాసంస్థ నేతృత్వంలో మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర్ ఫౌండేషన్ (విశాఖపట్టణం) సభ్యుల పర్యవేక్షణలో 206 మందికి వైద్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 62 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ ఆర్. కిశోర్ పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలు అర్థరహితం

గుమ్మలక్ష్మీపురం: గాంధీజీ, అంబేద్కర్‌లను ఉద్దేశించి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ అడ్డాకుల చిన్నారావు అన్నారు. స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడిన ఆయన రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ మధ్య ఎన్నో అభిప్రాయ బేధాలు ఉన్నాయని, గాంధీజీ వల్లే అంబేడ్కర్‌కు పదవులు వచ్చాయని పవన్ వ్యాఖ్యానించడం యావత్తు దేశ ప్రజలను విస్మయానికి గురిచేసిందన్నారు. ఇద్దరు మహాత్ముల మధ్య గొడవలు ఉన్నట్లు, వారి వ్యక్తిత్వాలను అగౌరవపరిచేలా మాట్లాడడం తగదని, పవన్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వారాహి యాత్ర పేరిట రాష్ట్రంలో తిరుగుతున్న ప్యాకేజీ స్టార్ మాట్లాడుతున్న తీరు ఆయనకు పరిపక్వత లేదనడానికి నిదర్శనమన్నారు.

ఆందోళన..



ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

భామిని: తాడేపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆశా వర్కర్ కృపమ్మ మరణించడానికి కారణమైన మెడికల్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ స్థానిక ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ, మృతురాలి కుటుంబ సభ్యులకు రూ. 50 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు.

గ్రామసభ

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస గ్రామంలో గ్రామసభ సోమవారం నిర్వహించారు. గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. సర్పంచ్ బి.చంద్రినాయుడు మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అలాగే పారిశుధ్యం మెరుగుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యదర్శి టి.భాస్కరరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం జరుగుతోందని, ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం

బలిజిపేట: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్దను పక్కాగా అమలు చేసి వారికి మంచి రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ-1 సామల సింహాచలం కోరారు. ఈ మేరకు ఆయన మండలంలోని పెదపెంకి-3 ప్రాథమిక పాఠశాలను సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మెనూ పరిశీలించి మెనూ ప్రకారం వంటలు వండింది లేనిదీ తెలుసుకున్నారు. విద్యార్థుల చేత ఆంగ్ల పాఠాలు చదివించి పదాలకు అర్థాలు అడిగి తెలుసుకున్నారు.

యుద్ధప్రాతిపదికన తాగునీటి బోరు ఏర్పాటు పనులు



డెప్పిగూడలో తాగునీటి బోరు ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ మిన్నారావు

కురుపాం: మండలంలోని జి.శివడ గ్రామపంచాయతీలోని డెప్పిగూడ గ్రామంలో తాగునీటి బోరు ఏర్పాటు పనులు యుద్ధప్రాతిపదికన సోమవారం చేపట్టారు. సర్పంచ్ బిడ్డిక మిన్నారావు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని డెప్పిగూడ గ్రామంతో పాటు కించాయిగూడ, డోకులగూడ, ఇప్పమానుగూడ, చింతమానుగూడ, జి.శివడ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పంచాయతీకి ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.40 లక్షల నిధుల్లో రూ.20 లక్షలను తాగునీటి సదుపాయాల కల్పనకు, మరో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి కేటాయించామన్నారు.

రీ సర్వేకు సహకరించాలి..



రీ సర్వే మూడో విడతపై సూచనలు చేస్తున్న తహసీల్దార్ సోమేశ్వరరావు

పాలకొండ రూరల్: మండలంలో ఫేజ్-3 సమగ్ర భూ సర్వే ప్రక్రియకు నిర్దేశిత గ్రామాల ప్రజా ప్రతినిధులు, భూ హక్కుదారులు, రైతులు సహకరించాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడో విడతలో భాగంగా చిన్నమంగళాపురం, జంపరకోట, టీకే.రాజపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, అక్కడి ప్రజలకు రీ సర్వే ఆవశ్యకతపై వివరించినట్లు చెప్పారు. ఈ క్రమంలో సర్వే ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని మండల సర్వేయర్ పి.వెంకటరావు, రీ సర్వే మొబైల్ డీటీ పి.సన్యాసిరావుకు సూచించారు.

వన్యప్రాణులను కాపాడుకుందాం..



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అటవీరేంజ్ అధికారి తవిటినాయుడు

పాలకొండ రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించి వన్యప్రాణులను రక్షించుకుందామని పాలకొండ అటవీ రేంజ్ అధికారి కె.తవిటినాయుడు అన్నారు. వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక వెంకమ్మపేట ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పరిసరాలతో పాటు పర్యావరణాన్ని సంరక్షించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థులు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.పరాంకుశంనాయుడు, సహోపాధ్యాయులు, అటవీశాఖాధికారులు రవిబాబు, కె.నీలవేణి, కె.రాజ్యలక్ష్మి, దాలినాయుడు, కుసమకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆశావహ మండలంగా తీర్చిదిద్దుకుందాం..



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ విజయకుమారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి

భామిని: మండలాన్ని ఆశావహ ప్రాంతంగా తీర్చిదిద్దుకుందామని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. నీతి అయోగ్ ఆధ్వర్యంలో చేపట్టిన సంకల్ప సప్తహా కార్యక్రమం ముగింపు వేడుకల్లో ఏడు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీడీఓ జి.చంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన సంకల్ప సప్తహా కార్యాక్రమంలో ఏడు రోజుల కార్యక్రమాల నివేదికలు వినిపించారు. ఎంపీపీ తోట శాంతికుమారి, డిప్యూటీ డీఈఓ పి.విజయకుమారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ కె.విజయపార్వతి మాట్లాడుతూ, మండల అధికారుల సేవలను కొనియాడారు. అనంతరం ఏడు శాఖలలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను సన్మానించారు. మండల స్థాయి ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన బత్తిలి హైస్కూల్ విద్యార్థిని సంతోషి పండాను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఓ డి.భవాని, ఎంఈఓ ఏ.శ్రీనివాస్, ఎంఏఓ కిమిడి నాగేశ్వరరావు, డీటీ నిమ్మల శేఖరం, ఏఈలు పి. గౌరీశంకర్, అలికాన సందీప్, సీడీపీఓ శాంతికుమారి, కీసర కార్యదర్శి ఎం,మహేంద్రకుమార్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొండ రూరల్:

మండలంలోని లుంబూరు గ్రామ సమీపంలో జగనన్న కాలనీలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్. బయ్యంనాయుడు, ఏఈ శ్యామ్‌సుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎం.నగర్, శ్రీనివాసనగర్, ఎన్కే.రాజపురం, సీఎల్.నాయుడు నగర్, కోమటిపేట, దేవరపేట, వెంకమ్మపేటతో పాటు మండల పరిధిలో వెలగవాడ, ఓని, సింగన్నవలస, సిరికొండ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని, వినియోగదారులకు సహకరించాలని కోరారు.

● ఆకట్టుకున్న గిరిజనోత్పత్తుల ప్రదర్శన

ట్రైబల్ ఎంపవర్‌మెంట్ మేళాలో భాగంగా సీతంపేట ఐటీడీఏ పరిధిలో వనధన్ వికాస్ కేంద్రాల (వీడీవీకే) ద్వారా తయారుచేసిన ఉత్పత్తులు, గిరిజన కళాకృతులను సోమవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రదర్శించారు. వినియోగదారులు తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేశారు. త్వరలో అమేజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ కంపెనీల ద్వారా ఉత్పత్తులను విక్రయించడానికి చర్యలు తీసుకోనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. -సీతంపేట



ఆకర్షిస్తున్న వెదురు ఉత్పత్తులు



చిరుధాన్యాల స్టాల్



సవరలిపి చిత్రాలు



గిరిజనులు తయారు చేసిన పసుపు, కొండచీపుర్లు